
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 24 ఆగస్టు 2024



జగనన్న భూభక్షకులు

జగనన్న భూరక్ష సర్వేలో వీఆర్వోల అక్రమాలు

ఒకరి భూమి మరొకరి ఖాతాలో మార్పులు చేర్పులు

ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన సుంకర సత్యనారాయణ కుటుంబసభ్యుల్లో ఎవరైనా చనిపోతే ఆ మండలంలోని పొణుకుమాడలో వారికి చెందిన 30 సెంట్ల భూమిలోనే అంత్యక్రియలు పూర్తిచేస్తారు. అక్కడే సమాధులు నిర్మిస్తారు. ఈ 30 సెంట్ల భూమి సత్యనారాయణ పేరుతోనే ఉంది. డాక్యుమెంట్లు కూడా ఆయన పేరుతోనే ఉన్నాయి. కానీ, అడంగల్‌లో మాత్రం అదే ఊరిలో ఎక్కడో ఉన్న వారి బంధువుల పేరుతో ఆ భూమిని మార్చేశారు.

పొణుకుమాడలోనే సుంకర సత్యనారాయణ కుమారుడు సుంకర రాజ్‌కుమార్ పేరుతో ఉన్న సుమారు 2 ఎకరాలను వేరే వ్యక్తులకు విక్రయించారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూరక్ష సర్వేలో భాగంగా అడంగల్‌లో ఆ భూమి సుంకర రాజ్‌కుమార్ పేరుతోనే మార్పు చేశారు. ఇదేమిటని భూమిని కొన్నవారు ప్రశ్నించగా, 'ఎకరా రూ.30 లక్షలపైనే పలుకుతుంది. లక్ష రూపాయలు ఖర్చు చేసుకోండి. అడంగల్‌లో సరిచేసి ఇస్తాం.' అని చెప్పారు.

ఒక్క పొణుకుమాడలోనే కాదు. ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా జగనన్న భూరక్ష సర్వేను ఆసరాగా చేసుకుని గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో)లు చెలరేగిపోయారు. అడంగల్‌లో ఇష్టారాజ్యంగా పేర్లు మార్చేసి, వాటిని సరిచేసేందుకు రూ.లక్షలు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. భూ యజమానులకు తెలియకుండా, వారికి నోటీసులు జారీ చేయకుండా జగనన్న భూరక్ష పేరుతో సర్వే నిర్వహించారు. ఈ ప్రక్రియలో వీఆర్వోలు మొదలు.. తహసీల్దార్ల వరకు డబ్బు కోసం తమ పనితనం చూపించారు. కొన్నిచోట్ల రైతులు అభ్యంతరాలు తెలియజేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభంకానున్న రెవెన్యూ సదస్సుల్లో జగనన్న భూరక్ష సర్వే అక్రమాలే ప్రధాన అంశం కానున్నాయి.

- తప్పులు సరి చేసేందుకు రూ.లక్షల్లో డిమాండ్
- ఉంగుటూరులో ఓ వీఆర్వోకు అడంగల్ స్పెషలిస్ట్‌గా పేరు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్త సమాచారం వీఆర్వోల వద్ద ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని అప్పట్లో వైసీపీ నాయకులు వీఆర్వోలను చెప్పుచేతల్లో పెట్టుకుని భూరికార్డులను ఇష్టారాజ్యంగా మార్చేశారు. పత్రాలు ఒకరి పేరు మీద ఉంటే అడంగల్‌లో మరొకరి పేరు ఉండేలా చేశారు. దాన్ని మార్పు చేయాలంటే వీఆర్వో, తహసీల్దార్లకు రూ.లక్షల్లో ముడుపు సమర్పించుకోవాల్సిన పరిస్థితి. మచిలీపట్నానికి చెందిన వైసీపీ కార్పొరేటర్‌కు పొట్లపాలెంలో కొంత భూమి ఉంది. ఆ భూమిలో 15 సెంట్లు తగ్గించేశారు. ఇదేమని వీఆర్వోను ప్రశ్నిస్తే.. స్థానిక వైసీపీ నాయకుడిని అడగమన్నారు. ఈ గొడవ చిలికిచిలికి గాలివానగా మారి అప్పటి మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని వద్దకు చేరింది. ఆయన కూడా తానేం చేయలేనంటూ చేతులెత్తేయడంతో చేసేది లేక సదరు కార్పొరేటర్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికీ ఆ 15 సెంట్లు ఆయన ఖాతాలోకి చేరలేదు.

గన్నవరం నియోజకవర్గంలో ఇష్టారాజ్యం

గన్నవరం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే వంశీ జగనన్న భూరక్షను ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవడానికి వాడుకున్నారు. టీడీపీ నాయకులు, సానుభూతిపరుల భూముల రికార్డులను తప్పులతడకగా మార్చేశారు. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో ఇలాంటి వ్యవహారాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.

ఆ వీఆర్వో పేరు చెబితే హడల్

ఉంగుటూరు మండలంలో తహసీల్దార్‌గా ముత్యాల శ్రీనివాస్ పనిచేసే కాలంలో వెబ్‌ల్యాండ్ వ్యవహారాలను అడ్డగోలుగా చక్కబెట్టే వారిని దగ్గరకు చేర్చుకున్నారు. ఈ క్రమంలో అప్పట్లో వీఆర్ఏలుగా పనిచేసే వినోద్, మూర్తి అనేవారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించి మరీ చేరదీశారు. ఆ తర్వాత కొంతకాలానికి తహసీల్దార్‌గా వచ్చిన వనజాక్షి కూడా వీఆర్వో వినోద్‌కు ప్రాధాన్యతనిచ్చారు. ప్రమోటీ వీఆర్వోగా గన్నవరం వచ్చిన వినోద్ ఆ తర్వాత డిప్యుటేషన్‌పై ఉంగుటూరు మండలానికి చేరారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో కింగ్ మేకర్‌గా ఎదిగారు. తహసీల్దార్‌గా పనిచేసిన వనజాక్షికి కుడిభుజంగా వ్యవహరించేవారు. మండలంలో వినోద్‌ను అడంగల్ స్పెషలిస్ట్ అని పిలుస్తారు. అడంగల్‌లో అడ్డగోలుగా పేర్లు మార్చేస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. తన పేరుతో మూడు ఎకరాలను కూడా ఈ విధంగానే వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ భాగం ఉంగుటూరు మండలంలోనే పనిచేశారు. రైతులెవరైనా పాస్‌బుక్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇక అంతే సంగతులు. పాస్‌బుక్ దరఖాస్తులను తన దగ్గరే తొక్కి పట్టేస్తారన్న పేరుంది. అడంగల్‌లో పట్టా నెంబరు ఉన్న కేసులకు పాస్‌బుక్‌లు ఇచ్చే సందర్భంలో రైతులకు చుక్కలు చూపిస్తాడు. పోరంబోకు భూములని మెలిక పెడతాడని, మళ్లీ వాటిని సరిచేయటానికి రూ.లక్షల్లో లంచం అడుగుతాడని స్థానిక రైతులు వాపోతున్నారు. అడంగల్‌లో పట్టా ఉన్నప్పుడు పాస్‌బుక్ ఇవ్వటానికి పోరంబోకు ఎలా అవుతుందో అర్థం కావట్లేదని లబోదిబోమంటున్నారు. గతంలో ఇష్టానుసారంగా డబ్బు తీసుకుని అడంగల్‌లో పేర్లను కూడా మార్చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వీఆర్వో అవినీతి వ్యవహా రాలపై గతంలో స్థానికుడైన వి.రామకృష్ణప్రసాద్ అప్పటి తహసీల్దార్ వనజాక్షి దృష్టికి పదేపదే తీసుకెళ్లినా విచారణ జరపలేదు. అతనిపై చర్యలు కూడా తీసుకోలేదు. లంచాలు తీసుకునే విషయంలో వీఆర్వో చాలా తెలివిగా వ్యవహరిస్తాడు. నేరుగా లంచం ఎప్పుడూ తీసుకోడు. డీల్ కుదిరాక ఫలానా వ్యక్తులకు డబ్బు ఇవ్వాలని తెలియజేస్తాడు. అధికారంలో ఏ పార్టీ ఉంటే వారితో తిరుగుతాడన్న ఆరోపణలు ఉన్నాయి.



సోలార్ పవర్ ప్లాంట్‌కు లీజుకు ఇస్తున్నారంటూ ప్రచారం సాగుతున్న స్వామివారి ఆలయ భూములు

ఆలయ భూములు హాంఫట్

నందిగామ రామలింగేశ్వరస్వామి భూములు స్వాహా

దీర్ఘకాలిక లీజుల పేరుతో దోపిడీ యత్నాలు

60 ఎకరాల భూమి 33 ఏళ్లకు లీజుకిచ్చేందుకు సన్నాహాలు

ఎకరం విలువ రూ.5 కోట్ల పైమాటే..!

తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు.. నందిగామలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూములను ఎవరు ఇష్టం వచ్చినట్టు వారు పంచుకుంటున్నారు. మొదట్లో స్వామివారికి 1,200 ఎకరాల భూమి ఉండగా, భూసేకరణ, అమ్మకాలు, ఆక్రమణల వల్ల ప్రస్తుతం 262.2 ఎకరాలకు తగ్గిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఇప్పటికే అనేక భూవివాదాలు కొనసాగుతుండగా, తాజాగా మరో వ్యవహారాన్ని దేవదాయ శాఖ అధికారులే తెరపైకి తెచ్చారు. రూ.వందల కోట్ల విలువైన స్థలాన్ని 33 ఏళ్ల లీజుకు బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతుండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్వామివారికి జరిగిన నష్టాలను మననం చేసుకుంటేనే.. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. - నందిగామ

60 ఎకరాలు 33 ఏళ్ల లీజుకట..!

నందిగామలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన అత్యంత విలువైన భూములను సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణం నిమిత్తం బడా పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నట్లు తెలిసింది. పట్టణంలో అంతర్భాగమైన సర్వే నెంబర్ 822-1ఏ, 823-1ఏ, 824-1ఏ, 828-1ఏ, 837-1ఏలోని 55 ఎకరాలు, 821లోని 5.38 ఎకరాలను 33 ఏళ్ల లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమి విలువ ఎకరం రూ.5 కోట్లు ఉంటుంది. ఇంతటి విలువైన భూమిపై కన్నేసిన పారిశ్రామికవేత్తలు వైసీపీ అధికారంలో ఉండగానే, లీజు పేరుతో ఆక్రమించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరగడంతో కొద్దిగా వెనుకడుగు వేశారు. తాజాగా సదరు వ్యక్తులు తిరిగి తమ ప్రయత్నాలు ప్రారంభించారు. దేవదాయ శాఖలో అవినీతిపరులైన కొందరు అధికారుల సహకారంతో లీజుల డ్రామాకు తెరలేపారు. ఆలయ భూములను దీర్ఘకాలిక లీజులకు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇటీవల నందిగామ వచ్చిన దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయ్‌కుమార్ మీడియాకు తెలిపారు. అయితే, దీనిని భక్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

(మిగతా 6లో)

పల్లెకు ఉపాధి

రూ.160 కోట్ల ఉపాధి నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు

- రెండేళ్లలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు
- పింఛన్లు ఇప్పించాలని పలువురు విన్నపం
- అసైన్డ్‌భూములకు నీటి తీరువా కట్టించుకోవాలని వినతులు
- జిల్లావ్యాప్తంగా 474 పంచాయతీల్లో గ్రామసభలు

గ్రామాలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. పల్లెల్లో పడకేసిన పాలనను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనకు సంకల్పించింది. అందులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించింది. ప్రజలు పెద్దఎత్తున ప్రజలు హాజరై గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలపై ఏకరువు పెట్టారు. గత ప్రభుత్వం పంచాయతీ నిధులను తమకు తెలియకుండానే పంచాయతీ బ్యాంకు ఖాతాల నుంచి డ్రా చేసుకుందని, అభివృద్ధి పనులను చేయడానికి అవకాశం లేకుండా పోయిందని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు విడుదల చేసి జవసత్వాలు కల్పించాలని సర్పంచ్‌లు కోరారు.



చిన్నాపురం గ్రామసభలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : తాగునీటి సమస్యను తీర్చాలని, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ శాసనసభ్యులు, మంత్రి కొల్లు రవీంద్రకు ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. గతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నించాలంటేనే ప్రజలు భయపడేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవ్వుతూ సమస్యలను వివరించే స్వేచ్ఛను చూస్తున్నానని, ప్రాధాన్యతాక్రమంలో గ్రామీణప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మచిలీపట్నం మండలంలోని చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో శాసనసభ్యులు, అధికారులు గ్రామసభల్లో పాల్గొని ప్రజల సమస్యలను విని, అర్జీలు స్వీకరించారు.

● రహదారులు, డ్రెయిన్లు నిర్మాణానికి ప్రాధాన్యం

అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లిలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రహదారులు, డ్రెయిన్ నిర్మాణానికి నిధులు అధికంగా వినియోగించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతిఒక్కరికీ ఏడాదిలో కనీసంగా 100 రోజుల పనిదినాలను కల్పిస్తామన్నారు. అనంతరం చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిని వారు పరిశీలించారు. చల్లపల్లి ఆసుపత్రిలో గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో కలెక్టర్ వైద్యశాఖ అధికారులతో మాట్లాడి ఇక్కడ గైనకాలజిస్టును నియమించాలని ఆదేశించారు.

● తాగునీటి సమస్యను పరిష్కరించాలని..

పెడన నియోజకవర్గంలో బల్లిపర్రులో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. బంటుమిల్లిలో డంపింగ్‌యార్డు గృహాల మధ్య ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. మల్లేశ్వరం మెగామంచినీటి పథకం వైసీపీ పాలనలో నిర్వీర్యమైందని, ఈ పథకం ద్వారా 14 పంచాయతీలకు తాగునీరు అందుతుందని, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాగిత కలెక్టర్‌కు సూచించారు. బంటుమిల్లిలో కచ్చా డ్రెయిన్ సమస్య ఇబ్బందిగా ఉందని పరిష్కరించాలని గ్రామస్తులు కోరడంతో డ్రెయిన్‌లను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● శ్మశానవాటిక, కాలువ గట్టు సమస్యపై దృష్టి పెట్టాలని..

పెనమలూరు నియోజకవర్గంలో పెదపులిపాక పంచాయతీ శివారు శ్రీనగర్‌కాలనీ వాసులు ఎంపీడీవో సునీతాశర్మ, సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరికి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈడుపుగల్లులో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు.

● పామర్రు నియోజకవర్గంలో పామర్రు, మొవ్వమండలం కూచిపూడి, పమిడిముక్కల పంచాయతీల్లో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా పాల్గొన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధిహామీ పనులు మరింతగా చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నాయని, పీహెచ్‌సీలలో వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని పలువురు కోరారు.

రూ.160 కోట్లతో జిల్లాలో అభివృద్ధి పనులు

మచిలీపట్నం మండలంలోని భోగిరెడ్డిపల్లి, చిన్నాపురం పంచాయతీల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. జిల్లాకు ఉపాధిహామీ పథకం నిధులు రూ.160 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో జిల్లాలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేస్తామని అన్నారు. మచిలీపట్నం మండలంలో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు రూ.220 కోట్లతో అంచనాలు రూపొందించామని, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటిని అందుబాటులోకి తెస్తామని అన్నారు. 150 ఎకరాల విస్తీర్ణంలో తాగునీటి చెరువును తవ్వించేందుకు భూసేకరణ చేసే పనిలో ఉన్నట్టు తెలిపారు. అసైన్డ్ భూములకు ఐదారేళ్లుగా నీటితీరువా కట్టించుకోవడం లేదని, దీంతో పీఏసీఎస్‌లలో అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇవ్వడం లేదని రైతులు మంత్రి కొల్లుకు వివరించారు.

బదిలీ బేరాలు..!

- సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు భారీ డిమాండ్
- రూ.కోట్లు పలుకుతున్న హాట్ సీట్లు
- పటమటకు రూ.3 కోట్లు, గాంధీనగర్, గుణదలకు రూ.4 కోట్ల చొప్పున..
- విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, గన్నవరం పోస్టులకు రూ.కోటి చొప్పున..
- తెరవెనుక చక్రం తిప్పుతున్న రాజకీయ పెద్దలు

సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో రాజకీయ ప్రమేయం కనిపిస్తోంది. బదిలీల ముసుగులో రూ.కోట్లలో బేరాలు సాగిస్తున్నారు. విజయవాడ నగరం, శివారు ప్రాంతాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటిస్తూ భారీగానే దండుకుంటున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని పటమట, గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్లను కదిలించేందుకు రంగం సిద్ధం కాగా, గ్రేటర్ విలీన జాబితా ప్రతిపాదనలో ఉన్న ప్రాంతాలు, ఇన్నర్, అవుటర్ రింగ్‌రోడ్ల అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రాజకీయ నాయకులు రంగప్రవేశం చేశారు. ఒక్కో పోస్టుకు భారీగా బేరాలు సాగిస్తున్నారు.

పటమటకు రూ.3 కోట్ల బేరం

ఆప్షన్ల పేరుతో సబ్ రిజిస్ట్రార్ల దగ్గర నుంచి రిక్వెస్టులు రాగా, పటమట, గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పెద్ద సంఖ్యలో మొదటి ఆప్షన్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పటమట సబ్ రిజిస్ట్రార్ పోస్టు రూ.3 కోట్ల వరకు ధర పలుకుతోంది. గతంలో రూ.కోటి, ఆ తర్వాత రూ.2 కోట్ల బేరం ఉన్న ఈ పోస్టు తాజాగా రూ.3 కోట్లకు చేరడం విశేషం. ఈ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు 2021-22లో రూ.148.57 కోట్లు, 2022-23లో రూ.214.39 కోట్లు, 2023-24లో రూ.238.02 కోట్ల ఆదాయం వచ్చింది. దాదాపు రూ.100 కోట్ల మేర ఆదాయం పెరిగింది. లావాదేవీలు కూడా బాగా జరుగుతున్నాయి. ఈ కారణంతో ఆదాయం కూడా జాస్తిగా ఉంటుందన్న పేరుతో ఇంత భారీ ధరను నిర్దేశించినట్టుగా తెలుస్తోంది.

గుణదల, గాంధీనగర్‌కు డిమాండ్

గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ కార్యాలయాల్లో పోస్టింగ్ కోసం రూ.2 కోట్ల ధర నిర్ణయించినట్టు సమాచారం. ఈ రెండు కార్యాలయాల్లో మొత్తం నలుగురు సబ్ రిజిస్ట్రార్లు ఉంటారు. జాయింట్-1, 2 సబ్ రిజిస్ట్రార్లకు సమంగా చెరి రూ.2 కోట్ల మేర ధర నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. మొత్తంగా ఒక్కో కార్యాలయానికి రూ.4 కోట్ల వరకు బేరం నడుస్తున్నట్టుగా సమాచారం. గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.92.42 కోట్ల ఆదాయం వచ్చింది. 2022-23లో రూ.107.79 కోట్లు, 2023-24లో రూ.138.12 కోట్లు వచ్చింది. దీనిని బట్టి చూస్తే.. రూ.50 కోట్ల మేర ఆదాయం పెరిగింది. లావాదేవీలు కూడా గణనీయంగా జరుగుతున్నాయి. దీంతో గుణదలను కూడా ఈసారి హిట్‌లిస్టులో పెట్టినట్టుగా తెలుస్తోంది. ఇవన్నీ చూస్తే ఒక్క విజయవాడలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనే రూ.11 కోట్ల మేర బేరం పెట్టినట్టు సమాచారం.

నున్న, ఇబ్రహీంపట్నం కూడా..

విజయవాడ రూరల్ ప్రాంతంలోని నున్న సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు కూడా డిమాండ్ ఏర్పడింది. ఇక్కడి పోస్టుకు రూ.కోటి బేరం పెట్టినట్టు సమాచారం. విజయవాడ మీదుగా బైపాస్ వెళ్లడం, రానున్న రోజుల్లో నాగపూర్-ముంబయి ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు జరుగుతుండటం, సీఆర్‌డీఏ ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనను దృష్టిలో ఉంచుకుని నున్నకు డిమాండ్‌ను సృష్టించారు. నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.62.59 కోట్ల ఆదాయం వచ్చింది. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ పోస్టును కూడా ఇన్నర్, ఎన్‌హెచ్-30, అవుటర్ రింగ్ తదితరాలను దృష్టిలో ఉంచుకుని భారీగా పెంచారు. ఇబ్రహీంపట్నం పోస్టుకు కూడా రూ.కోటి ధర పలుకుతున్నట్టు తెలుస్తోంది.

గన్నవరానికి కూడా గిరాకీ

గన్నవరం ర్యాపిడ్ గ్రోత్ ఏరియా పరిధిలో ఉంది. ఇక్కడ విజయవాడ వెస్ట్, ఈస్ట్ బైపాస్‌లు, సీఆర్‌డీఏ ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, ఐటీ సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కుల కారణంగా ఈ ప్రాంతం శరవేగంగా విస్తరిస్తోంది. రియాలిటీ రంగం అనూహ్యంగా పురోగమిస్తోంది. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆదాయం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.53.64 కోట్లు ఉండగా, 2022-23లో రూ.61.96 కోట్లను సాధించింది. 2023-24లో అయితే రూ.81.18 కోట్ల ఆదాయం సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకు చేరవచ్చంటున్నారు. దీంతో గన్నవరం సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు కూడా రూ.కోటి ధర నిర్దేశించినట్టుగా తెలుస్తోంది.





శ్రావణ సందడి..

- మూడో శుక్రవారం పోటెత్తిన భక్తులు
- దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

6లో..

ఆపరేషన్ హెల్మెట్!

- స్పీడ్ పెంచిన ట్రాఫిక్ కాప్స్
- హెల్మెట్ ధారణ తప్పనిసరికి ప్రణాళికలు
- హెల్మెట్ లేకపోతే వాహనం సీజ్
- హెల్మెట్ తెచ్చుకున్నాకే వాహనం విడుదల

పేదల ఉపాధి లక్ష్యంగా..



ఇంద్రకీలాద్రిపై సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

శ్రావణ సందడి..

- మూడో శుక్రవారం పోటెత్తిన భక్తులు
- దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వన్‌టౌన్, ఆగస్టు 23 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మహామండపం ఆరో అంతస్తులో వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి అర్చకస్వాములు, వేద పండితులు వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని నిర్వహింపచేశారు. తొలివిడత ఆర్జిత సేవ కింద సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. అనంతరం సుమారు 500 మంది మహిళలు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలలో పాల్గొన్నారు. వీరందరిచేత సంకల్ప పూర్వక వరలక్ష్మి వ్రతాన్ని చేయించారు. భక్తులకు అవసరమైన పూజాసామాగ్రిని దేవస్థానం సమకూర్చింది. అమ్మవారికి పూలు, పసుపు, కుంకుమలు, గాజులు, పరిమళ ద్రవ్యాలు, టెంకాయలు, అరటి పండ్లు, వివిధ రకాల ఫలాలు, వస్త్రం, తదితరాలను సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాన్ని డిప్యూటీ ఈవో లీలాకుమార్ పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని శీఘ్ర దర్శనం చేసుకున్నారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్ భక్తుల నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు దుర్గామల్లేశ్వర దేవస్థానం మజ్జిగ పంపిణీ చేసింది.



లక్షకుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీచక్ర నవావరణార్చన, ఖడ్గమాల, చండీహోమం తదితర కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి శుక్రవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసి ఖడ్గమాలార్చనలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం ఆమెకు వేదపండితులు తీర్థ ప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు విరాళం..

విశాఖపట్నం, ఎంవీపీ కాలనీకి చెందిన పేరిచర్ల జానకిరామరాజు రూ.1,01,116లు విరాళాన్ని పేరిచర్ల రూపవతి రూ.1,01,116లు విరాళాన్ని మేనేజర్ రామకృష్ణ ద్వారా దుర్గగుడిలో అన్న వితరణ కార్యక్రమానికి శుక్రవారం విరాళంగా అందజేశారు.





ప్రత్యేక అలంకరణలో తిరుపతమ్మ, నిమ్మకాయల అలంకరణలో అంకమ్మవారు

తిరుపతమ్మ ఆలయంలో..

పెనుగంచిప్రోలు : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకులు పలు రకాల పుష్పాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. అదేవిధంగా ఉన్న ఊరు అంకమ్మ వారిని నిమ్మకాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ భూములు హాంఫట్!

(5వ పేజీ తరువాయి)

పారువేట మండపంలో జరిగింది మరిచారా...?

వైసీపీ అధికారంలో ఉండగా స్వామివారి ఆలయానికి చెందిన పారువేట మండపం స్థలం దీర్ఘకాలిక (11 ఏళ్లు) లీజు పేరుతో వేలం వేశారు. సదరు భూమిలో లీజుదారుడు ఎటువంటి అనుమతులూ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మించాడు. దీనిపై ఈవోను బాధ్యుడిని చేసి, సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు.. తప్ప లీజుదారుడిపై చర్యలు తీసుకోలేదు. ఎలాగూ భవన నిర్మాణం జరిగింది కనుక కొనసాగించుకోవచ్చని లీజుదారుడికి అనుకూలమైన ఉత్తర్వులిచ్చారు. ఆరు సెంట్ల భూమిని అద్దెకు తీసుకున్న వ్యక్తి ఇంత చేస్తే 50 ఎకరాలను 33 ఏళ్లపాటు లీజుకు తీసుకునే పారిశ్రామికవేత్తలు తిరిగి ఆలయానికి ఆ భూములు చెందనిస్తారా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్ల పేరుచెప్పి అర ఎకరం స్వాహా

అయ్యప్ప ఆలయం సమీపంలోని సర్వే నెంబర్ 821లో 5.38 ఎకరాల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్థలాల దిగువకు అక్రమంగా మూడు రోడ్లు వేశారు. దీనివల్ల స్వామివారికి చెందిన సుమారు అర ఎకరం భూమి అన్యాక్రాంతమైంది. మరోవైపు కొందరు అక్రమార్కులు ఈ భూమి నుంచి సుమారు 35 సెంట్లను ఆక్రమించారు. ఈ విషయాలు తెలిసి కూడా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. భక్తుల ఒత్తిడి మేరకు సర్వే నిర్వహిస్తున్న అధికారులు సరైన కొలతలు వేయకుండా అక్రమార్కులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతున్నారు. ఈ భూమి విలువ సెంటు రూ.20 లక్షల వరకూ ఉంటుంది. రోడ్లతో పాటు ఆక్రమణకు గురైన మొత్తం భూమి విలువ రూ.10 కోట్ల వరకూ ఉంటుంది.

రూ.20 కోట్ల నష్టపరిహారం ఎక్కడ..?

బైపాస్ రోడ్డు విస్తరణ సందర్భంగా 828-1ఏ, 837-1ఏ నుంచి 2.10 ఎకరాలను హైవే అథారిటీ సేకరించింది. ఇక్కడ అందరికీ గజాలలో పరిహారం ఇచ్చిన ఆ శాఖ అధికారులు స్వామివారి ఆలయానికి చెందిన 2.10 ఎకరాలకు మాత్రం ఎకరాల్లో లెక్కకట్టి రూ.58 లక్షలే చెల్లించారు. దీనివల్ల ఆలయానికి రూ.20 కోట్ల వరకూ నష్టం వాటిల్లింది. దీనిపై భక్తులు పలు ఆందోళనలు చేశారు. విచారణ జరిపిన గత కలెక్టర్ ఆ రూ.20 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. ఆ సొమ్ము కోసం దేవదాయ శాఖ అధికారులు ఇప్పటికీ కనీస ప్రయత్నాలు కూడా చేయలేదు.

20 సెంట్ల నివాస స్థలం కొట్టేసే కుట్ర..!

స్వామి ఆలయం వెనుక ఉన్న మరో ఆలయానికి చెందిన 20 సెంట్ల నివాస స్థలం విషయంలో కూడా కుట్ర జరుగుతున్నట్లు భక్తులు అనుమానిస్తున్నారు. సుమారు రూ.10 కోట్ల విలువైన ఈ భూమి కోసం కొందరు అక్రమార్కులు దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. సదరు భూమిని ప్రాపర్టీ రిజిస్టర్ నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది.

పాలకులు స్పందించాలి

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూముల విషయంలో పాలకులు స్పందించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి ఆలయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, లీజుల పేరుతో అన్యాక్రాంతాన్ని నివారించాలంటున్నారు. అక్రమాలకు తావిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి వివరించాలని స్థానిక భక్తులు యోచిస్తున్నారు.

- జీవనప్రమాణాలు పెంపొందించేందుకే గ్రామసభలు
- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి : ఉపాధి పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకుని వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకే గ్రామసభలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి పథకం పేదలకు పని కల్పించే విశిష్టమైన పథకమని, ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించటం ప్రభుత్వ బాధ్యత కాగా, కల్పించిన పనులు చేయడం లబ్ధిదారుల హక్కు అన్నారు. పనులు కోరిన 15 రోజుల్లో పనులు కల్పించడటంతోపాటు లబ్ధిదారుల ప్రదేశంలోనే పనులు కల్పిస్తారని, 5 కిలోమీటర్లకు పైగా దూరంలో పనులు కల్పిస్తే 10 శాతం అదనపువేతనం పొందే హక్కు లబ్ధిదారుకు ఉంటుందన్నారు.



చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారిని సన్మానిస్తున్న కలెక్టర్ బాలాజీ

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ చర్యలు తీసుకోండి

చల్లపల్లిలో డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వేస్ట్ సమస్య ఎక్కువగా ఉందని సర్పంచ్ కృష్ణకుమారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలని, అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దాంతోపాటు ఆరు అంశాల విషయమై స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా చల్లపల్లి మండలానికి మూడు కోట్లకు పైగా నిధులు, చల్లపల్లి గ్రామానికి రూ.2.60కోట్ల నిధులు మంజూరుచేసినట్టు తెలిపారు. త్వరలో బైపాస్ డ్రైనేజీ నిర్మాణం, గ్రామంలో నూటికి నూరుశాతం సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. డ్రైనేజీలు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు, సత్కారం పొందిన చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారిని కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీఎల్‌పీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో చినరాట్నాలు, సీఐ కె.ఈశ్వరరావు, ఏపీఎం రామ్మోహన్, ఈవో మాధవేంద్రరావు, వార్డు సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి : అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం బంటుమిల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుజ్ఞానం కృష్ణవేణి అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి నియోజకవర్గంలో రూ.23 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మండలంలో రోడ్లు, పాఠశాలలు, శ్మశానం షెడ్లు, ఇతర అవసరాల కోసం రూ.3.80 కోట్లతో అంచనాలు వేయడం జరిగిందన్నారు. రూ.64 లక్షలతో డ్రెయిన్ల అభివృద్ధి జరగనుందని తెలిపారు. డ్రైనేజీ, డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, ఉపాధి పథకం పనులు కోరే వారికి 15 రోజుల్లో పని కల్పించడమే ప్రభుత్వ బాధ్యత అన్నారు. ప్రతి ఇంటికి విద్యుత్, తాగు నీరు, టాయిలెట్, గ్యాస్ సౌకర్యం లక్ష్యం అన్నారు. ఇప్పటి వరకు మండలంలో 6 సీసీ రోడ్లు, 23 డ్రెయిన్ల పనులకు అనుమతి లభించిందని, ఇతర పనులకు అర్జీ ఇవ్వాల్సి ఉందన్నారు. టంగుటూరి ప్రకాశం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఎంపీడీవో స్వర్ణభారతి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



బంటుమిల్లి గ్రామసభలో ఎమ్మెల్యే కాగిత, కలెక్టర్ బాలాజీ



భోగిరెడ్డిపల్లిలో పింఛన్లు కోరుతూ గోడు వినిపిస్తున్న మహిళలు

పింఛన్లు ఇప్పించండి..

- భోగిరెడ్డిపల్లిలో అంగన్వాడీ భవనం పూర్తి చేయాలి
- మంత్రి రవీంద్రకు వినతుల వెల్లువ



చిన్నాపురం ఇంటర్ విద్యార్థి ఆదిత్యకు హామీ ఇస్తున్న మంత్రి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 : బందరు రూరల్ మండలంలో శుక్రవారం భోగిరెడ్డిపల్లి, చిన్నాపురంలలో జరిగిన గ్రామసభల్లో మంత్రి కొల్లు రవీంద్రకు ప్రజలు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. భోగిరెడ్డిపల్లిలో అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని మంత్రిని కోరారు. తమకు పింఛన్లు మంజూరు చేయించాలంటూ పలువురు వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లునిర్మించాలని, గ్రామ శివారు రామఖండంలో శ్మశానం నిర్మించాలని, ఊరిలో చెరువు తవ్వించి ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని గ్రామ ప్రజలు కోరారు. చెరువు తవ్వించేందుకు సీలింగ్ భూమి అందుబాటులో ఉందన్నారు. బందరు నుంచి భోగిరెడ్డిపాలెం గ్రామానికి ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరించాలని కోరారు. బస్సును అర్ధాంతరంగా ఆపివేయడం వల్ల ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. చిన్నాపురంలో తాగునీటి సౌకర్యం మెరుగు పరిచేందుకు చెరువును ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని గ్రామ ప్రజలు కోరారు. చెరువుకు ర్యాంపు వేయించాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతులిచ్చారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థి కె.ఆదిత్య శస్త్రచికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యం : వసంత

ఇబ్రహీంపట్నం రూరల్ : సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పెద్ద ఎత్తున గ్రామ సభలు నిర్వహించినట్టు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం జూపూడిలో ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజనతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.22.50 కోట్లతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. డీఎంఎఫ్, సీఎస్ఆర్ నిధులతో మరిన్ని పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ, గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్ముని ఆశయాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, సర్పంచ్ కె.దేవమాత, డ్వామా పీడీ జె.సునీత, డీపీవో ఎన్.వి శివ ప్రసాద్‌యాదవ్, టీడీపీ నేతలు జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజ), గొర్నేని గాంధీ, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జూపూడి గ్రామసభలో కలెక్టర్ సృజనకు కొండపల్లి బొమ్మను బహూకరిస్తున్న ఎమ్మెల్యే వసంత

నోవా, నిమ్రాపై ఫిర్యాదులు : స్థానికంగా నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలపై గ్రామ సభలో గ్రామస్థులు కలెక్టర్, ఎమ్మెల్యే వసంతకు ఫిర్యాదులు చేశారు. నోవా కళాశాల గత పదేళ్లుగా పంచాయతీకి పన్నులు చెల్లించడం లేదని, నిమ్రా కళాశాల రెండేళ్లుగా పన్నులు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు.

ఆపరేషన్ హెల్మెట్!



- స్పీడ్ పెంచిన ట్రాఫిక్ కాప్స్
- హెల్మెట్ ధారణ తప్పనిసరికి ప్రణాళికలు
- హెల్మెట్ లేకపోతే వాహనం సీజ్
- హెల్మెట్ తెచ్చుకున్నాకే వాహనం విడుదల

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో రహదారులపై ఎటుచూసినా ద్విచక్ర వాహనదారుల తలపై హెల్మెట్లు కనిపిస్తాయి. దూరంతో సంబంధం లేకుండా బైక్‌పై బయటకు వచ్చారంటే తలపై హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తారు. రాజధాని అమరావతిలో భాగంగా ఉన్న విజయవాడలో ద్విచక్ర వాహనదారులు మాత్రం హెల్మెట్ సంస్కృతికి పూర్తిగా అలవాటు పడటం లేదు. హెల్మెట్ ధరించడం తలపై భారంగా భావిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు చెల్లించడానికి సిద్ధమవుతున్నారే తప్ప హెల్మెట్‌ను పెట్టుకోవడానికి ఇష్టపడటం లేదు. నగరంలో బ్లాక్‌స్పాట్‌ల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి హెల్మెట్ లేకపోవడమే కారణమని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు నగరంలో తిరిగే ప్రతి వాహనదారుడి తలపై హెల్మెట్ ఉండేలా చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా ఆపరేషన్ హెల్మెట్ చేపట్టారు.

చిక్కితే బైక్ సీజ్

వాహనదారులు నగరంలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్‌ను కచ్చితంగా ధరించాలని కొద్దిరోజులుగా అన్ని విద్యాసంస్థలు, యూత్ క్లబ్‌ల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల కొత్త చట్టం ప్రకారం జరిమానాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు. అయినప్పటికీ విజయవాడలో హెల్మెట్‌ధారణ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. కొద్దినెలలుగా ట్రాఫిక్ పోలీసులు వివిధ కూడళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి చలాన్లు విధిస్తున్నారు. అయినా హెల్మెట్ ధారణ పెరగకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ మోతాదును పెంచారు. తనిఖీల సమయంలో హెల్మెట్ లేకపోతే వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. వాహనాలను ఎంజీ రోడ్డులో ఉన్న కేఎస్ వ్యాస్ ట్రాఫిక్ కాంప్లెక్స్ వెనుక గల ఏఆర్ గ్రౌండ్‌కు తరలిస్తున్నారు. సంబంధిత వాహనదారులు హెల్మెట్ తీసుకొచ్చిన తర్వాత మాత్రమే వాహనాలను విడుదల చేస్తున్నారు. హెల్మెట్ తెచ్చుకున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు. కొంత మంది వాహనదారులు ఇళ్లకు ఫోన్లు చేసి హెల్మెట్లను రప్పించుకుంటున్నారు. మరికొంతమంది సమీపంలో ఉన్న ఆటోమొబైల్ షాపులకు వెళ్లి హెల్మెట్లను కొనుగోలు చేస్తున్నారు. ఇలా కఠినంగా వ్యవహరిస్తే వాహనదారుల్లో మార్పు వస్తుందని ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. రోజుకు నగరంలో మొత్తం 200 కేసులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి సంబంధించినవే ఉంటున్నాయి.

రెండు నెలలు.. 10వేలకు పైగా కేసులు

ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై ముఖ్యంగా దృష్టి సారిస్తున్నారు. ప్రతి వాహనదారుడి తలపై హెల్మెట్ ఉండేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. విజయవాడలోని ప్రతి కూడలి, విశాలంగా ఉన్న ప్రదేశాల వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. రెండు నెలల కాలంలో కేవలం హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 10,817 కేసులు నమోదు చేశారు. గడచిన నెలలో మొత్తం 6170 కేసులు నమోదు చేశారు. అందులో 220 మంది వాహనదారులు జరిమానాలు చెల్లించారు. ఇంకా 5950 మంది చలాన్లను చెల్లించాల్సి ఉంది. ఆగస్టులో ఇప్పటి వరకు 4647 కేసులను నమోదు చేశారు. వారిలో 128 మంది చలాన్లు చెల్లించారు. మరో 4519 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎట్టకేలకు.. చిక్కాడు

- నగరంలో వరుస స్నాచింగ్‌లు
- సీసీఎస్ పోలీసుల అదుపులో యువకుడు
- రూ.6.10లక్షల ఆభరణాలు స్వాధీనం



విలేకర్లకు కేసు వివరాలను వెల్లడిస్తున్న సీసీఎస్ ఏసీపీ స్రవంతిరాయ్, ఇతర అధికారులు

విజయవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాసం కోసం పొరుగు జిల్లా నుంచి బెజవాడకు వచ్చాడు. స్నేహితులతో కలిసి ఒక రూంలో ఉంటూ డిగ్రీ పట్టా పొందాడు. కాలేజీ రోజుల్లో తిరిగిన వీధులను ఇప్పుడు స్నాచింగ్ పాయింట్లుగా మార్చుకున్నాడు. చివరికి సీసీ కెమెరాల్లో చిక్కి పోలీసులకు దొరికిపోయాడు. ఈ వివరాలను సీసీఎస్ ఏసీపీ స్రవంతిరాయ్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్ కిషోర్‌తో కలిసి శుక్రవారం వెల్లడించారు. యన్నం సాయితేజరెడ్డి బీఏ పూర్తి చేశాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు వద్ద లింగంగుంట్ల గ్రామానికి చెందిన తేజ విజయవాడలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. అతడి తండ్రి వడ్డీ వ్యాపారి. విజయవాడలో స్నేహితులతో కలిసి రూంలో ఉండేవాడు. కాలేజీ చదువుతున్నప్పుడు నగరంలో అన్ని ప్రాంతాలపై అవగాహన పెంచుకున్నాడు. డిగ్రీ తర్వాత స్వగ్రామం వెళ్లిన తేజ వ్యవసనాలకు అలవాటుపడ్డాడు. మద్యం, సిగరెట్లు, క్రికెట్ బెట్టింగ్‌ల రుచి మరిగాడు. చెడు వ్యసనాలకు డబ్బులు లేకపోవడం, ప్రతిసారి ఎక్కువ మొత్తంలో తండ్రిని డబ్బులు అడిగితే అనుమానం వస్తుందన్న ఆలోచనతో చోరీలను ఎంచుకున్నాడు. నరసరావుపేట నుంచి బైక్ తీసుకుని, హెల్మెట్ వెంట పెట్టుకుని విజయవాడకు వస్తున్నాడు. స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పేవాడు. ఇక్కడికి వచ్చిన తర్వాత మాచవరం, పటమట ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహించి ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసుకునేవాడు. వారి పక్క నుంచి వెళ్లి మెడలో ఉన్న బంగారు గొలుసులను లాక్కుని వెళ్లిపోయేవాడు. ఆ వస్తువులను అమ్మడం, తాకట్టు పెట్టడం ద్వారా వచ్చిన డబ్బులతో ఎంజాయ్ చేసేవాడు. జేబులు ఖాళీ అయిన తర్వాత మళ్లీ విజయవాడకు వచ్చి స్నాచింగ్‌లు చేసేవాడు. ఈవిధంగా మాచవరం, పటమట పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు స్నాచింగ్‌లు చేశాడు. నరసరావుపేటలో మరో స్నాచింగ్ చేశాడు. విజయవాడలో ఇంకో నాలుగు స్నాచింగ్‌లకు విఫలయత్నం చేశాడు. స్నాచింగ్‌లు జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. అన్ని ఫుటేజీల్లోను బైక్ నంబరు ఒకేలా ఉండడంతో దాని ఆధారంగా తేజ చిరునామాను పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని 87గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6.10లక్షలు ఉంటుంది.



జ్వర బాధితురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

- ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా

పామర్రు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. శుక్రవారం గ్రామంలో ఆయన పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సూచలను పాటిస్తూ ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. గ్రామంలో శానిటేషన్ విధానంపై పలు సూచనలు చేశారు. వైద్య అధికారి రాజేష్, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌సలీం, కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి, ఆరోగ్య సిబ్బంది, కూటమినేతలు పాల్గొన్నారు.



చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే

చల్లపల్లి : కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌లు శుక్రవారం మధ్యాహ్నం చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రోగులను పరామర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు గురించి ఆరాతీశారు. ఈసీజీ, అల్ట్రాసౌండ్ విభాగం, డెంటల్, రక్తపరీక్షల విభాగం, బ్లడ్ స్టోరేజీ యూనిట్ తదితర వైద్య విభాగాల గురించి పరిశీలించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉందని, భర్తీకి సంబంధిత వైద్య ఉన్నతాధికారులతో కలెక్టర్ ఫోన్లో మాట్లాడారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెంట్ డాక్టర్ బీఎస్ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టల్ ప్రజెంటేషన్‌లో విజేతలు

మచిలీపట్నం టౌన్ : నేషనల్ స్పేస్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో నిడుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని టి.జ్ఞానశ్రీవల్లికి ప్రథమ బహుమతి సాధించినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ మహమ్మద్ జాకీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కూచిపూడి జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.లిల్లిమ్మకు ద్వితీయ, గుడివాడ ఫాదర్ బియాంకి హైస్కూల్ విద్యార్థిని ఎం.స్నేహజకు తృతీయ బహుమతి లభించాయన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

ఎరువుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు

గన్నవరం, ఆగస్టు 23 : రైతులకు ఈ- పాస్‌తోనే ఎరువులు విక్రయించాలని లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని ఏవో ఎస్‌ఎల్ తేజస్విని హెచ్చరించారు. మండలంలోని కేసరపల్లి శ్రీసాయిరామ ఎంటర్ ప్రైజెస్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధిత ఎరువులను విక్రయించటం నేరమన్నారు. ఎరువుల స్టాక్, ప్రైస్ బోర్డులు సక్రమంగా ఉండాలన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో తేజస్విని

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గ్రామ సభలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఈడుపుగల్లు (కంకిపాడు) 23 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటవికపాలన కొనసాగిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లులో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. పోలీసు వ్యవస్థను సైతం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు వినియోగించారన్నారు. గత ఐదేళ్లలో రోడ్డుగాని, డ్రెయిన్‌గాని నిర్మించిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో గంజాయి రాజ్యమేలిందన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి మంచి పరిపాల అందిస్తారని 151 సీట్లు ఇచ్చి గెలిపిస్తే అయన విధ్వంసకర పాలన చూసి 2024 ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. రానున్న 5 ఏళ్లలో నియోజకవర్గంలోని అన్ని రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ వందిపాటి ఇందిర, ఇన్‌చార్జి ఎంపీడీవో భాస్కర్ పాల్గొన్నారు.



పెదపులిపాకలో సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న శ్రీనగర్ కాలనీ వాసులు

సమష్టికృషితో గ్రామాభివృద్ధి



గండిగుంట గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో విమాదేవి

ఉయ్యూరు : సమష్టికృషితో గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో విమాదేవి అన్నారు. ఉయ్యూరు మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయి. సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు పలు అంశాలపై చర్చించి ప్రణాళిక ఆమోదించారు. గండిగుంటలో జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో విమాదేవి పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎంపీటీసీలు, గ్రామస్తులు, ఉపాధిహామీ పథకం కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేయాలి

పెనమలూరు : పెనమలూరు మండలంలో శుక్రవారం ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో ముఖ్యంగా గ్రామాల్లోని రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేయాలంటూ ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. పెనమలూరు లో జరిగిన గ్రామసభలో రోడ్లు బాగుచేయాలంటూ గ్రామస్థులు సర్పంచ్ లింగాల భాస్కరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, తోటకూర శ్రీదేవి, మటపర్తి బుజ్జి, చిగురుపాటి శ్రీనివాసరావు, మట్టా జాన్, కంచర్ల శ్రీనివాస్, కిలారు ఆంజనేయులు, ఎలమంచిలి ప్రసాద్, పాముల బలరాం, పీఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● పెదపులిపాకలో జరిగిన గ్రామసభలో కరకట్ట కింద ఉన్న శ్రీనగర్‌కాలనీ వాసులు తమ కాలనీ సమస్యలపై ఎంపీడీవో సునీతా శర్మ, సర్పంచ్ గుంటూరు శ్రీనివాస చౌదరికి వినతిపత్రం అందించారు. టీడీపీ నాయకుడు ముసునూరి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామంలోని ఎన్టీఆర్ నగర్‌లోని డ్రెయిన్ నిర్మాణాన్ని పంచాయతీ నిధుల నుంచి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాసరావు, గుజ్జర్లపూడి బాబూరావు, ముసునూరి నిర్మల్, గుండిమెడ నాగమధు, చందు, ధనలక్ష్మి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కేసరపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు

సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం : గత ఐదేళ్లలో గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లని దుస్థితి నెలకొంది. ఎటు చూసినా సమస్యలు జటిలమయ్యాయి. వాటిని పరిష్కరించాలని శుక్రవారం జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభల్లో ప్రజలు గగ్గోలు పెట్టారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలు ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగాయి. కేసరపల్లి గ్రామ సభలో మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణరావు , టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న పాల్గొన్నారు. గన్నవరంలో న్యాయవాది జాస్తి తాతారావు మాట్లాడుతూ, డ్రెయి నేజీలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని గ్రామంలోని సమస్యలు ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. వీరపనేనిగూడెంలో సీసీ రోడ్డు నిర్మించాలని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ దానుకు వినతిపత్రం అందజేశారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా శుక్రవారం బాపులపాడు మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు. మడిచర్ల, వేలేరు, రేమల్లె, మల్లవల్లి, కె.సీతారాంపురం, ఆరుగొలను, రంగన్నగూడెం, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మండల వ్యాప్తంగా డ్రెయినేజీ, తాగునీటి కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణం, రహదారుల అభివృద్ధి సమస్యలతో పాటు రీసర్వే సమస్యలే ప్రధానంగా గ్రామసభల్లో ప్రజలు ప్రస్తావించారు.

మూడేళ్లు నరకం చూశాం

గుణదల : సర్పంచ్ పదవిలో ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం అన్న ఆలోచనతో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం ఎంతగానో దోహదపడుతుందని రామవరప్పాడు గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి అన్నారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం చేపట్టిన గ్రామసభల్లో భాగంగా విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడులో గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ వరి శ్రీదేవి మాట్లాడుతూ, 2021లో సర్పంచ్‌గా మొదటి సారిగా గెలిచిన తాను ప్రజలకు ఏమీ చేయలేకపోయానని వాపోయారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నబిగాని కొండ, టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్‌కుమార్, అద్దేపల్లి సాంబశివనాగరాజు(సాంబు) పాల్గొన్నారు.

ఉంగుటూరు : గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధి, సాధికారత సాధించడమే ప్రత్యేక గ్రామసభల ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజనసంక్షేమశాఖ అధికారి వి.ప్రకాష్ అన్నారు. మండలంలోని 27గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు జరిగాయి. తేలప్రోలులో జరిగిన గ్రామసభలో ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.



తేలప్రోలు గ్రామసభలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 23 : సింగన్నగూడెంలోని గంగాపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి పురుషోత్తపట్నానికి చెందిన బండి భాస్కర్ సోదరులు విరాళం అందజేశారు. దాతలు శుక్రవారం ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కమిటీ సభ్యులకు రూ. 1,05,000 విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగేశ్వర శర్మ, ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నక్కా శ్రీమన్నారాయణ, రాజా, మరీదు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న బండి భాస్కర్ సోదరులు

వైభవంగా మురళీకృష్ణ ఆలయ ప్రతిష్ఠ

గన్నవరం, ఆగస్టు 23 : మండలంలోని కేసరపల్లిలో కొత్తగా నిర్మించిన మురళీకృష్ణ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పేరంటాలమ్మకు గాజుల అలంకారం





గాజుల అలంకారంలో పేరంటాలమ్మ.. సోమేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ

గుణదల, ఆగస్టు 23: రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 30వ తేదీన 108 మంది ముత్తయిదువలచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. వ్రతంలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఉయ్యూరు : శ్రావణ మాస నాల్గవ శుక్రవారం పురస్కరించుకుని జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ, వేణుగోపాలస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీదేవిలకు గాజుల అలంకారం, సువాసినిలు సామూహిక కుంకుమార్చన కన్నుల పండువగా చేశారు. ఆలయ ఈవో వీడీ ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు.

పిచ్చికుక్క దాడి- ముగ్గురికి గాయాలు

గన్నవరం, ఆగస్టు 23 : స్థానిక పట్టణంలో కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులుగుంపులుగా ఉండి పాదాచారులను, వాహనదారులపై ఎగబడుతున్నాయి. శుక్రవారం పాత గన్నవరంలోని పోస్టాఫీస్ ఎదురు రోడ్డులో ముగ్గురిని పిచ్చి కుక్క కరిచింది. దీంతో వాళ్లు ప్రభుత్వాస్పత్రికి పరుగులు తీశారు. ఒక మహిళను పిచ్చి కుక్క కరవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది.

ఆంధ్రకేసరి టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం



గన్నవరంలో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న పరిషత్ నాయకులు



రేమల్లే హైస్కూల్‌లో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం



పెనమలూరులో..

గన్నవరం, ఆగస్టు 23: దేశ ప్రజల కోసం అనంతరం శ్రమించిన యోధుడు ప్రకాశం పంతులు అని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధి కేవీఆర్ కిషోర్ అన్నారు. గన్నవరంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా విగ్రహానికి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్, బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన నిస్వార్థ ప్రజా సేవకుడు టంగుటూరి అని కొనియాడారు. అనంతరం పాలాభిషేకం చేశారు. గోపరాజు సత్య పవన్‌కుమార్, మామిళ్లపల్లి నాగ సుబ్బారావు, జీఎస్సార్ మూర్తి, టీవీ సుబ్బారావు, చదలవాడ శివ నాగేశ్వరరావు, ఆదిత్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** రేమల్లె హైస్కూల్‌లో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతో కలిసి హెచ్ఎం లూథర్‌పాల్ నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రిగా కర్తవ్యదీక్ష, నిస్వార్థం చేసిన సేవలు యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో దారపురెడ్డి భాస్కరరావు, దివి పార్థసారధి, పరసా రాజేష్, వెలమర్తి రవిబాబు, శ్రీలక్ష్మి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● రంగన్నగూడెంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీటీసీ పసులూరి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, మొవ్వా వేణుగోపాల్ తదితరులతో కలిసి తహసీల్దార్ నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ఉయ్యూరు :** స్వాతంత్ర సమరంలో బ్రిటీష్ వారిని ఎదిరించి తుపాకి గుండుకు ఎదురుగా గుండె నిలిపిన ధీరశాలి టంగుటూరి ప్రకాశం అని పలువురు కీర్తించారు. ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరి చిత్రపటానికి నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. తాడిగడప మునిసిపాలిటీ తాడిగడప, యనమలకుదురు, పోరంకి, కానూరుల్లో యువత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడిగడప మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు


ఉంగుటూరు, ఆగస్టు 23 : గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఇంటిపై శుక్రవారం ఆత్కూరు పోలీసులు మెరుపు దాడిచేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. మండలంలోని తేలప్రోలులో ఒక ఇంట్లో పేకాడుతున్నారనే పక్కా సమాచారంతో ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తన సిబ్బందితో కలిసి ఇంటిపై దాడిచేశారు. ఇంట్లో సోదాలు జరుపగా ఇంటి యజమాని జి.ఆదినారాయణతోపాటు మరో ఆరుగురు పేకాడుతున్నట్లు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గన్నవరం, ఆగస్టు 23 : గుండుగొలను- కాజ బైపాస్‌లో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. గన్నవరం సమీపంలోని బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ బ్లాక్‌లను ఆత్కూరు గ్రామానికి చెందిన గాడి రవి (50) మద్యం మత్తులో ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతా మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 23 : హనుమాన్‌జంక్షన్ గ్రామ ప్రముఖుడు, శ్రీకృష్ణాథియేటర్ యజమాని, బాపులపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతా వెంకటేశ్వరరావు(82) అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత కొంత కాలంగా అస్వస్థతకు గురై విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు బంధువులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని కృష్ణామిల్క్ యూని యన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, చింతల వెంకటశివ అప్పారావు, వేగిరెడ్డి బాలాజీ, డాక్టర్ దుట్టా రాంచంద్రరావు, మాజీ జెడ్పీటీసీ సుంకర సుబాస్‌చంద్రబోస్, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వ రరావు, అక్కినేని రాఘవేంద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తదితర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



చింతా వెంకటేశ్వరరావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఆగస్టు 23 : యనమలకుదురు సబ్ స్టేషన్ 33కేవీ పరిధిలో మెయిన్‌టెనెన్సు పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 9-30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. యనమలకుదురు , డొంకరోడ్డు, గ్రీన్‌సిటీ కాలనీ, ఇందిరానగర్ 1, 2 కాలనీలు, చిన్నకట్ట, పెదపులిపాక, శ్రీనగర్ కాలనీ, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ● పోరంకి సెక్షన్ పరిధి మహాలక్ష్మీనగర్ 11కేవీ ఫీడరు పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ హరిబాబు తెలిపారు. బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మీనగర్, వసంత్‌నగర్, విష్ణుపురం కాలనీ, సాయినగర్, బందరు రోడ్డు, గద్దె ఆర్టీసీకాలనీ, లక్ష్మీపురం కాలనీ, బ్రహ్మంగారి గుడిరోడ్డు, రంగాబొమ్మ ప్రాంతం, సుగాలి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని తెలిపారు. **ఉయ్యూరు :** ఉయ్యూరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు మరమ్మతుల నిర్వహణ కారణంగా శనివారం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8నుంచి 10-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ డి. కృష్ణనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75

కేపీటీ పాలెం వద్ద ముషారఫ్ మృతదేహం గుర్తింపు

కోడూరు, ఆగస్టు 23 : మండలం హంసలదీవి బీచ్ వద్ద ఈనెల 18వ తేదీన గల్లంతైన గుడివాడకు చెందిన యువకుడు అబ్దుల్ ముషారఫ్ (21) మృతదేహం ఎట్టకేలకు బయటపడింది. గత ఆరు రోజులుగా మృతదేహం కోసం ప్రత్యేక బోట్లలో గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం బందరు మండలం కేపీటీపాలెం వద్ద ముషారఫ్ మృతదేహం కన్పించినట్లు కోడూరు ఎస్సై పి.శిరీష తెలిపారు. మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం అనంతరం బాధిత కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు ఆమె తెలిపారు.



అవనిగడ్డ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పామర్రు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



గూడూరు గ్రామసభలో మాట్లాడుతున్న వేదవ్యాస్



కానూరులో మాట్లాడుతున్న గోపు

గ్రామాల అభివృద్ధికి ఐక్య కృషి

● ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభల్లో ఎమ్మెల్యేలు మండలి, కుమార్ రాజా

అవనిగడ్డ, ఆగస్టు 23 : రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడదామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలో శుక్రవారంన మన పంచాయతీ - మన సాధికారిత గ్రామసభలో బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడా రు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నియోజకవర్గంలో 391 సీసీ రహదారులకు రూ.18.40 కోట్లు మంజూరయ్యాయన్నారు. అభివృద్ధికి రాజకీయాలకతీతంగా సహకరిస్తామని ముందుకు వచ్చిన సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎంపీపీ తుంగల సుమతిదేవిలను ఆయన అభినందించారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సమన్వయంతో రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నాయన్నారు. మండలి వెంకట్రామ్, కిరణ్, నజీర్ బాషా, సత్యనారాయణ, రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు, గుడివాక శివరావు, బొప్పన భాను పాల్గొన్నారు. **నాగాయలంక :** మండలంలోని 22 గ్రామపంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. సర్పంచ్‌లు అధ్యక్షత వహించారు. ఉపాధి పనులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. నాగాయలంక పంచాయతీలో రక్షిత మంచినీటి పథకాన్ని విస్తరించాలని నాగిడి తాతారావు, లకనం నాగాంజనేయులు, లంకే శ్రీనివాస ప్రసాద్ తదితరులు ఈవోపీఆర్‌డి అప్పల నరసమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. మండవ బాలవర్ధిరావు పాల్గొన్నారు. భావదేవరపల్లిలో సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఎంపీడీవో జె.వి.సీతారామ కుమార్, ఏపీవో ముత్యాలు, కార్యదర్శి మల్లిఖార్జునరావు, వక్కపట్లవారిపాలెంలో సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్, వీఆర్వో భోగాది మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** గ్రామాభివృద్ధి లక్ష్యంగా అధికారులు ప్రజలతో కలిపి సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీలలో ఎంపీడీవో పర్యవేక్షణలో గ్రామసర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కోడూరు గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, గ్రామసర్పంచ్ వెన్నా షైనీ, పంచాయతీ కార్యదర్శి ఉదయ లక్ష్మి, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్థులు పాల్గొన్నారు. **ఘంటసాల :** మండలంలోని 22 గ్రామపంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. సర్పంచ్‌లు



కోడూరు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ షైని

అధ్యక్షత వహించారు. ఉపాధి పనులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో చేసిన పనులు, పథకంలో చేర్చిన కొత్త పనులు వివరించారు. తాడేపల్లి గ్రామంలో సర్పంచ్ పడమటి సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్‌డి గుత్తికొండ కిషోర్, టీడీపీ నాయకులు యార్లగడ్డ వీరభద్రరావు, కొడాలి లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాబ్ కార్డులు ఇవ్వలేదని ఫిర్యాదు

అవనిగడ్డ రూరల్ : జాబ్ కార్డు ఇవ్వటం లేదని పులిగడ్డ శివారు దళితవాడకు చెందిన మరిణియ్య ఉపాధి హామీ పథకం గ్రామసభలో ప్రత్యేకాధికారి ఎస్.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. స్పెషల్ ఆఫీసర్ రమేష్ స్పందిస్తూ ఈ ఏడాది మరిణియ్యకు పని కల్పించాలన్నారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, పంచాయతీ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఈవో అనిత, గ్రామస్థులు పాల్గొన్నారు. అశ్వారావుపాలెంలో ఏపీవో కిరణ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పలు పనులను ప్రారంభిస్తూ తీర్మానం చేశారు. సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి యలవర్తి రమాకుమారి, ఎంపిటిసి కటికల వసంత్ పాల్గొన్నారు. మండలలోఓ మొత్తం 49 సీసీ రోడ్లు, 251 పంట బోదుల పనులు గుర్తించినట్లు తెలిపారు.

సమస్యలపై వినతులు

మచిలీపట్నం టౌన్ : బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో వివిధ గ్రామాల ప్రజలు కి సీసీ రోడ్లు కావాలని, డ్రైనేజీలు తవ్వించాలని వినతిపత్రాలు సమర్పించారు. తాళ్ళపాలెం, కానూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు శ్మశాన వాటికలకు ప్రహరీ లు నిర్మించాలని, సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని కోరారు. ఉపాధి హామీ పనుల కింద వివిధ అభివృద్ధి పనులు చేపడతామని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పేర్కొన్నారు. తరకటూరు గ్రామసభలో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పాల్గొన్నారు. తరకటూరు గ్రామస్తులు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. **పెడన :** గూడూరు గ్రామసభలో గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, సర్పంచ్ లింగం సులోచనారాణి, మాజీ సర్పంచ్‌లు అన్నం హరిరామ కృష్ణ, పోతన రామోజీ, టీడీపీ నాయకులు ఎస్‌ఏ బేగ్, డొక్కు నాగరాజు, యా రా ప్రసాద్ పాల్గొన్నారు. **పెడన రూరల్ :** ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలు నిర్వహించి, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీవో వి రెడ్డయ్య అన్నారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలలో శుక్రవారం ఈఓఆర్డీ జయరామ, ఏపీవో వజీర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమస్రవంతి, ఏపీఎం శ్రీదేవి, యంఈఓ2 హరనాధబాబుల నేతృత్వంలో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక వసతులు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్య, వైద్యం సమస్యను అధికారులు తెలుసుకున్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శిలు ప్రజలు పాల్గొన్నారు

వీధి దీపాలైనా వెలిగించండయ్యా..!

మోపిదేవి : వీధి దీపాలైనా వెలిగించండయ్యా..! అంటూ వెంకటాపురంలోని గ్రామసభలో గ్రామస్థులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీడీవో రామలింగేశ్వరరావు ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. వీధి దీపాలు నాలుగు నెలలుగా వెలగటం లేదని, వాటినైనా వెలిగించేలా చూడాలని పలువురు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీలో నిధులు లేక అప్పులు చేసి పాలన సాగిస్తున్నామని సర్పంచ్ సమాధానమివ్వగా, నాలుగు సంవత్సరాల కాలంలో గ్రామానికి మీరు ఏం అభివృద్ధి చేశారో తెలియజేయాలని గ్రామస్థులు ప్రశ్నించారు. గ్రామంలోని చెరువును ఉపాధి హామీ పనులకు కేటాయించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్మశాన వాటిక మెరక చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. పెదకళ్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో అర్హత కలిగి పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు నగదు ఇచ్చేలా చూడాలని కోరారు. పెదప్రోలులో సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, కె.కొత్తపాలెంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ మాదవి అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి.

308 సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు : వర్ల

కూచిపూడి : నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.25 కోట్లతో 308 సీసీ రోడ్ల అభివృద్ధి పర్చటానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు. కూచిపూడిలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిలికానాంధ్ర సంజీవని వైద్యశాల పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ భర్త కొండవీటి అమల బాలేశ్వరరావు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఐదవ వార్డులో రహదారికి నిధులు మంజూరు చేయాల్సిందిగా పావులూరి వెంకటేశ్వరరావు కోరారు. ఎస్టీ కాలనీలో వంతెనపై మందుబాబులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పరుచూరి పార్వతీ అనే మహిళ వాపోయారు. గ్రామస్థులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తూ గ్రామసభలకు ఆలస్యంగా రావటం మంచి సంప్రదాయం కాదని, పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, లింగమనేని రామలింగేశ్వరరావు, ఎండివో సుధా ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి భవాని, వీరంకి తులసీదాస్ పాల్గొన్నారు. **పామర్రు :** గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, ప్రజల అభీష్టం మేరకు కూలీలకు పనుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. పంచాయతీ పాలక వర్గం తరపున గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ రవికమాంత్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సురేష్ ఆయనను ఘనంగా సత్కారించారు. తాడిశెట్టి నరేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వల్లూరిపల్లి గణేష్, యార్లగడ్డ రమేష్, పంచాయతీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పమిడిముక్కల గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ ఎం. సునీత అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఏపీవో కిరణ్, కార్యదర్శి సుధాకర్ త దితరులు పాల్గొన్నారు. మండల పరిధిలో గ్రామ సభలు ప్రశాంతంగా ముగిసాయి.



ఉపాధి పథకం పనుల్లో సబ్సిడీ పథకాలు : అట్లూరి

గుడివాడ రూరల్ : ఉపాధి హామీ పథకం గ్రామీణులకు వరమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, బొమ్ములూరు గ్రామ ప్రత్యేకాధికారి అట్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 21 గ్రామపంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామ సభలు జరిగాయి. బొమ్ములూరు సభలో అట్లూరి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో కోళ్లపెంపకం, ఉద్యాన వన పెంపకం, పశువుల షెడ్లు తదితరాలు పూర్తి సబ్సిడీతో అందిస్తామని, రైతులు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. రోడ్ల అభివృద్ధి చేయాలని మోటూరు, దొండపాడు, లింగవరం ప్రజలు కోరారు. బిళ్లపాడు, వలివర్తిపాడు గ్రామసభలో పారిశుధ్య సమస్యను ప్రజలు ప్రస్తావించారు. డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. బొమ్ములూరు, బిళ్లపాడులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. పారిశుధ్యం లోపించిందని, మౌలిక వసతులు కల్పించాలని మల్లాయిపాలెం ప్రజలు కోరారు. వాసే మురళీ, అంగడాల సతీష్, ఎంపీడీవో ఏ.వెంకటరమణ, లింగవరం గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ ఏఈ వల్లభనేని సూరిబాబు, ఏవో బోలెం అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **నందివాడ (జనార్ధనపురం) :** మండలంలోని 23 పల్లెల్లో గ్రామసభలు ప్రశాంతంగా నిర్వహించారు. జనార్ధనపురంలో జరిగిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకుడు, విమానాశ్రయం బోర్డు మెంబర్ తులసీ పాల్గొన్నారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ఈవోపీఆర్‌డి శ్రీనివాస్, భానుప్రకాష్, రూపేష్; పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** ఎంపీడీవో, ప్రత్యేకాధికారి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన గుడ్లవల్లేరు గ్రామ సభలో ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, స్థలాల ఆక్రమణలు ఎక్కువవుతున్నాయని, కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని, సీసీ రోడ్ల నిర్మాణం వంటి అంశాల చర్చకు వచ్చాయి, డోకిపర్రులో సీసీ రోడ్ల నిర్మాణం, పెదపాలెంలో తాగునీటి సమస్యను, విన్నకోట పంచాయితీ జేమ్స్ పేటలో కాల్వగట్టు నివాసితులకు పట్టాలు ఇవ్వాలని, కమ్యూనిటీ భవనం ఏర్పాటు నిర్మించాలని కోరారు. **తోట్లవల్లూరు :** మండలంలో 16 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తోట్లవల్లూరులో డ్రైనేజీలు, సిమెంటు రోడ్లు, పారిశుధ్య సమస్యలపై గొరిపర్తి గోపయ్య తదితరులు అధికారులకు వినతిపత్రం అందించారు. సర్పంచ్ రాధిక, వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు, కార్యదర్శి పుష్పనాథం పాల్గొన్నారు.

గ్రామసభలకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

కూచిపూడి : కోసూరులో శుక్రవారం నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గుర్తింపు గ్రామసభలకు ఆటంకం కలిగించటమే కాకుండా పంచాయతీ కార్యదర్శి విధులకు భంగం కలిగించి, అభ్యంతరకరంగా మాట్లాడిన సంఘటనలో బుర్రే మస్తాన్, పాలేటి సునంద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.



బుర్రె మస్తాన్ తాగిన మైకంలో గ్రామసభ జరుగుతుండగా, కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించి సభను అడ్డుకోవటమే కాకుండా వారించిన స్టేషన్ కానిస్టేబుళ్ల ప్రమోద్, మోహనరావులపై తిరగబడటంతో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎంఎస్.ఎన్.మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

గుడివాడ : సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, గంజాయి, డ్రగ్స్ అనర్థాలపై కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం టూటౌన్ సీఐ నాగప్రసాద్, సీసీఎస్ సీఐ రమణమ్మ



అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను ధరించాలని, మోటారు వాహనాల చట్టాలను గౌరవించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





కొండాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



గుడివాడలో గాజుల అలంకారం



బందరులో వ్రతంలో బాలికలు



దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో..

కొండాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 : మచిలీపట్నంలోని ప్రధాన దేవాలయాల్లో శుక్రవారం వైభవంగా వరలక్ష్మీదే వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. బచ్చుపేట వేంకటేశ్వర స్వామి, రాబర్ట్‌సన్‌పేట రామలింగేశ్వర స్వామి, రంగనాయక స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మాస్టర్ ఇ.కె.బాలభాను విద్యాలయం ఆవరణలోని కోదండ రామాలయంలో విద్యార్థినులు సామూహిక లక్ష్మీ అష్టోతర పారాయణ చేశారు. **గుడ్లవల్లేరు :** వేమవరం కొండాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 300 మందికి పైగా మహిళలు సా మూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. భక్తులకు అన్నవితరణ జరిగింది. వ్రతం నిర్వహించిన మహిళలకు కొండాలమ్మ చిత్రపటాలు బహుకరించారు. ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ సభ్యులు తులసి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **నాగాయలంక :** మండలంలోని దుర్గా గణపేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి - అరుణ దంపతులు, దేవస్థానం ఈవో సిహెచ్.సుధాకరరావు పాల్గొన్నారు. **గుడివాడ :** విజయదుర్గమ్మ గాజుల అలంకారంలో దర్శన మిచ్చారు.



యూనియన్ బ్యాంకు సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన



ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 : కోల్‌కతా హత్యాచార సంఘటనను హత్యను ఖండిస్తూ, దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ బ్యాంకు అధికారులు, ఐద్వా ప్రతినిధులు శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రీజినల్ హెడ్ వెంకట్రావు, డిప్యూటీ రీజనల్ హెడ్ రామలింగారెడ్డి, మేనేజర్ వెంకటరాజు, ఉద్యోగుల సంఘ రీజనల్ సెక్రటరీ సలాం, శ్రీనివాస్, ఉదయ్, వాణి, రమ్య, గాయత్రి, సుజన, ఉష, కామేశ్వరి, పావని తదితరులు పాల్గొన్నారు. కాగా ఐద్వా కార్యదర్శి కొడాలి సుజాత, చిరువోలు విజయలక్ష్మి, బూరభవానీ, తాడంకి స్వర్ణలత, పేటేటి స్రవంతి, లావణ్య, భారతి, కవిత, పూజిత, లిల్లి పాల్గొన్నారు.



బంటుమిల్లి : కోల్‌కతా హత్యాచార ఘటనకు నిరసనగా బంటుమిల్లిలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. నాగేశ్వరరావు, మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, ధనశ్రీ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. శిడింబి అగ్రహారం, గానుగకొట్టు సెంటర్‌లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. డ్రెయిన్లలో సిల్టు తీయించారు. ఎ దోమలు పెరగకుండా ప్రజలు ముం దస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పి.వి. ఫణి కుమార్, డాక్టర్ బొల్లా ప్రసాద్, వాలిశెట్టి తిరుమలరావు, కాళీపట్నపు రఘు, మాదివాడ వెంకట నరసింహారావు, శ్యామ్, వెంకటేశ్వరరావు, అడ్మిన్ అల్లా భక్షు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కూచిపూడి : కూచిపూడి దుర్గానగర్‌లో దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా శంకుస్థాపన జరిగింది. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.